క్లుప్తంగా

పోలీసు కుటుంబాలకు అండ



చెక్కు అందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: విధి నిర్వహణలో పోలీస్ మరణిస్తే బాధిత కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఇటీవల హెడ్‌కానిస్టేబుల్ రమణ గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ.7.56 లక్షలచెక్కును సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో శశికళ, సూపరింటెండెంట్ నయీమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య పాల్గొన్నారు.

వైద్యసేవలపై అధికారుల పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల పరిధిలో అందుతున్న వైద్యసేవలపై సోమవారం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమియొద్దీన్ పరిశీలించారు. సారంగాపూర్ పీహెచ్‌సీ, బీర్‌పూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)ను సందర్శించి వైద్యసిబ్బందితో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను, ల్యాబ్, ఫార్మా గదులను పరిశీలించారు. వారి వెంట మండల వైద్యాధికారి రాధారెడ్డి, సీహెచ్‌వో కుద్దుస్, సూపర్‌వైజర్ కిషోర్, ఏఎంవో సత్యనారాయణ, శ్రీధర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే



నివాళి అర్పిస్తున్న దావ వసంత

రాయికల్: మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని ఇటిక్యాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లల చదువుకు నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అని, ఆమె ఆశయ సాధన కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, పట్టణ కో–ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఎనగందుల ఉదయశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య పోరాటం చేయాలి



మాట్లాడుతున్న సాయిచరణ్

జగిత్యాల: సమస్యలపై ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని గోసంగి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్యాల సాయిచరణ్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘ బలోపేతానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్, ఉపాధ్యక్షుడు రవీందర్, తిరుపతి, రమేశ్, రాజేశ్, పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు హైదరాబాద్‌లోని సోచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంధుల వృద్ధాశ్రమం ఏర్పాటు కోసం సోమవారం పాఠశాలలోని విద్యార్థులు రూ.1,17,328 విరాళాలు సేకరించారు. వాటిని పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు సంస్థ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

‘క్యాటరింగ్’కు పాలిటెక్నిక్ విద్యార్థులు

- హాస్టల్ విడిచి అర్ధరాత్రి వరకు..
- అధికారుల పర్యవేక్షణ లోపం

కోరుట్ల: కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కొందరు క్యాటరింగ్ పనులకు వెళుతున్నారు. కొంతమంది హాస్టల్ సిబ్బంది సహకారంతో బయటకు వెళ్లి అర్ధరాత్రి వరకు సుమారు కిలోమీటర్ దూరంలో ఓ ఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పనులు చేస్తున్నారు. హాస్టల్ సిబ్బందిలో కొంతమంది క్యాటరింగ్ నిర్వాహకులతో మాట్లాడుకుని పాలిటెక్నిక్ సెకండియర్, థర్డియర్ చదువుతున్న వారిని సదరు ఫంక్షన్ హాల్‌కు క్యాటరింగ్ కోసం పంపుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా పంపించినందుకు హాస్టల్ సిబ్బందికి ఒక్కో విద్యార్థికి రూ.50 చొప్పున క్యాటరింగ్ నిర్వాహకులు చెల్లిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి కళాశాల నుంచి విద్యార్థులెవరూ బయటకు వెళ్లకూడదు. ఇది నిబంధన. కానీ.. ఇక్కడి విద్యార్థులు తరచూ క్యాటరింగ్ పనుల కోసం బయటకు వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. క్యాటరింగ్ కోసం వెళ్లిన వారు వడ్డనకు పరిమితం కాకుండా కూరగాయలు కోయడం.. పెద్దపెద్ద వంటపాత్రలను డైనింగ్ హాల్‌కు తీసుకెళ్లడం, టేబుళ్లు, ప్లేట్లు సర్దిపెట్టడం వంటి పనులు చేస్తున్నట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకు క్యాటరింగ్ పనులు చేసిన విద్యార్థులు తిరిగి సుమారు కిలోమీటరు దూరం నడిచి హాస్టల్‌కు చేరుకుంటున్నారు. పొరపాటున జాతీయ రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్యను వివరణ కోరగా.. విద్యార్థులు హాస్టల్ నుంచి బయటకు వెళ్లే అవకాశం లేదని, ఫంక్షన్ హాల్‌లో వీడియోలు, ఫొటోలు పరిశీలించి చెబుతానని తెలిపారు.

‘రాజకీయ కక్ష సాధింపులు సరికాదు’



అధికారులతో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: అధికార పార్టీ అండదండలతో బీఆర్‌ఎస్ నాయకులపై రాజకీయ కక్ష సాధింపులకి పాల్పడితే తగిన మూల్యం చెల్లిస్తారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని రత్నాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు దేవ మల్లయ్య(డీలర్)కి చెందిన గొర్రెల ఫామ్‌ను సందర్శించి మాట్లాడారు. దేవ మల్లయ్య అన్ని అనుమతులతో కేంద్ర ప్రభుత్వ పథకంలో గొర్రెల ఫామ్ నిర్వహిస్తున్నాడని, రాజకీయంగా మల్లయ్యను ఎదుర్కొలేక ఆర్థికంగా దెబ్బతీయాలని కుట్రపూరితంగా తొలగించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. అధికారులు నాయకుల ఒత్తిడికి తలవంచొద్దని, తప్పుడు నిర్ణయాలతో అధికారులు బలికావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్‌ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

‘అసైన్డ్‌భూమిలో అక్రమ నిర్మాణం’

మల్లాపూర్: అసైన్డ్ భూమిలో బీఆర్‌ఎస్ నాయకుడు గొర్రెల ఫాంను అక్రమంగా నిర్మించాడని, దీనికి మాజీ ఎమ్మెల్యే వత్తాసు పలకడమేంటని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ లైవ్‌స్టాక్ నిబంధనలకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ నాయకుడు దేవ మల్లయ్య అసైన్డ్‌భూమిని పట్టాభూమిగా చూపి గొర్రెల ఫాం నిర్మించుకుని లక్షలాది రూపాయలు లబ్ధి పొందాడన్నారు. దీనిపై సమీప రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారని, దీనికి కాంగ్రెస్ పార్టీకి, మండల నాయకులకు గాని ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుపు బోర్డుతో రైతులకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు ఒరిగింది ఏమిలేదని జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు అన్నారు. జగిత్యాల మార్కెట్ యార్డును సోమవారం నాయకులు సందర్శించి మాట్లాడారు. గతేడాది పసుపు పంటకు క్వింటాల్‌కు రూ. 18–19 వేల ధర ఉంటే, ఈ ఏడాది రూ. 8–9 వేల ధర కూడా పలుకడం లేదన్నారు. క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర వచ్చే వరకు రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. పసుపు రైతుల ధర్నాకు అధిక సంఖ్యలో రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, నల్ల రమేశ్ రెడ్డి, కర్నె రాజేందర్, పాపన్న, మురళీధర్ రెడ్డి, బందెల మల్లయ్య పాల్గొన్నారు.

పసుపు రైతుల ధర్నా విజయవంతం చేయాలి

మేడిపల్లి: పసుపు పంటకు కనీస మద్దతు ధర రూ.15వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే పసుపు రైతుల మహా ధర్నాకు రైతులు భారీగా తరలిరావాలని జిల్లా ఐక్య వేదిక నాయకులు కోరారు. సోమవారం మండంలోని తొంబరావుపేటలో రైతులను కలిసి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పన్నాల తిరుపతి రెడ్డి, మామిడి ధర్మారెడ్డి, లక్మారెడ్డి, సాయిరెడ్డి, గంగారెడ్డి, సతీష్, వెంకటి, రాజరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు యూడీఐడీ కార్డు తీసుకోవాలి

జగిత్యాల: దివ్యాంగులు యూడీఐడీ కార్డు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులతో సమావేశమయ్యారు. వికలాంగుల కోసం రూపొందించిన వాల్ పోస్టర్లు ప్రతిచోటా అంటించాలన్నారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లినప్పుడు వారికి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం కల్పించాలన్నారు. సంక్షేమాధికారి బోనగిరి నరేశ్, డీఎంహెచ్‌వో ప్రమోద్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ, రాజ్‌కుమార్, సుమన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన దన్నపునేని సుమన్‌చంద్ర (45) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం మృతిచెందాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం కోనాపూర్‌కు చెందిన సుమన్ చంద్ర తీవ్ర అనారోగ్యంతో సమస్యలు ఎదుర్కొంటు ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2న ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు జగిత్యాలకు తరలించి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తమ్ముడు సుజిత్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

జగిత్యాల: సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీ సాధన సమితి జిల్లా కన్వీనర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మల్లేశం, అంజయ్య, పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం

మెట్‌పల్లి: పట్టణంలోని 9 వార్డు పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాసపత్రి భూపతి, ఉపాధ్యక్షుడిగా గుంటుక హన్మాండ్లు, కార్యదర్శిగా చిలువేరి శ్రీనివాస్, కోశాధికారిగా పసునూరి ఆనంద్, ప్రచార కార్యదర్శిగా పొన్న భూపతి, గౌరవ అధ్యక్షులుగా రాంపల్లి రమేశ్, సంకు గంగాధర్‌ను ఎన్నుకున్నారు.

రాంచందర్‌ను తిరిగి కొనసాగించండి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేసిన జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్‌ను తిరిగి ఇక్కడే విధుల్లోకి తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లతకు జిల్లాలోని వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులు సోమవారం వినతిపత్రం అందించారు. చిన్నచిన్న కారణాలతో జిల్లా వ్యవసాయాధికారిని సస్పెండ్ చేయడం ద్వారా ఇతర అధికారులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే తిరిగి నియమించాలని కోరారు.



కనుల పండువగా నృసింహస్వామి కల్యాణం

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేట నాగపెల్లి లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘బోనస్’ కోసం ఆందోళన



రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

వెల్గటూర్: సన్న వడ్ల బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఎండపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై బీజేపీ శ్రేణులు ధర్నాకు దిగాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు అన్ని హామీలు నెరవేర్చాలని, సన్న వడ్లతో పాటు దొడ్డు వడ్లకు కూడా బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు హన్మంతరావు, ఓబీసీ మండల అధ్యక్షుడు దివాకర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరేశ్, కిరణ్ ు పాల్గొన్నారు.

కస్తూర్బాకు రహదారి నిర్మాణం



కస్తూర్బా పాఠశాలకు నిర్మించిన సీసీరోడ్డు

సాక్షి స్పందన

పెగడపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాకు సీసీరోడ్డు నిర్మాణం చేయడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాఠశాల వరకు వెళ్లేందుకు సక్రమంగా రహదారి లేక విద్యార్థినులు, టీచర్లు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల కస్తూర్బా ‘రహదారి అస్తవ్యస్తం’ అనే శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఇటీవల రూ. 12 లక్షలు మంజూరు చేయగా, స్థానిక నాయకులు సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో విద్యార్థినులు, టీచర్లు ‘సాక్షి’కి, నిధులు మంజూరు చేసిన విప్ లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లిరూరల్:అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.సోమవారం అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం రాగా టాస్క్‌ఫోర్స్ బృందం అక్కడికి వెళ్లగా రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు.ఇసుక అవసరాలు ఉన్నవారు అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

పాఠశాలలోవాటర్‌ఫిల్టర్ ప్రారంభం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో వీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్యూరిఫైర్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎంఈవో శ్రీపతి రాఘవులు, ఫౌండేషన్ ప్రతినిధులు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల దాహార్తి తీర్చడం కోసం ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ నాయకులకే ప్రాధాన్యం ఇవ్వాలి

రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన సీఆర్‌ఆర్ నిధులను ఎస్సీ సామాజిక వర్గ కార్యకర్తలకే ఇవ్వాలని కోరారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు కొడిపెల్లి ఆంజనేయులు, నాయకులు బాపురపు నర్సయ్య, తలారి రాజేశ్, మారంపల్లి గంగాధర్, తిరుపతిబాబు పాల్గొన్నారు.

మొక్కజొన్న, కందులు కొనండి

జగిత్యాలటౌన్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అదేవిధంగా నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేసినప్పటికీ రైతులకు మద్దతు ధర అందడం లేదన్నారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించినట్లుగానే పసుపునకు మద్దతు ధర కల్పించి రైతులకు అండగా నిలవాలని లేఖలో కోరారు.

ఇసుక డంపునకు వేలం

మల్లాపూర్: మండలంలోని సాతారం శివారులో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుకడంప్ కు మంగళవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని ధర్మారం, గొల్లపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి ఉండేందుకు నిర్మించిన బస్టాండ్‌ను ఆక్రమించి ఆటోలు నిలుపుతుండటంతో పాటు పాన్ డబ్బా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్టాండ్ ప్రాంగణం ఆటోలతో నిండిపోవడంతో ఆర్టీసీ బస్సులు ఎక్కడ పడితే అక్కడే నిలుపుతున్నారు. దీంతో బస్సు ఎక్కడ ఆగుతుందో తెలియక ప్రయాణికులు అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చొరవతీసుకుని బస్టాండ్‌లో ఆటోలు నిలపకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సునీత, డిపో మేనేజర్, జగిత్యాల,సెల్ నం: 8074092371

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా మల్లన్న జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో మల్లన్న జాతర ఉత్సవాలను యాదవులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నెరేళ్ల దేవేందర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, మనోజ్, శ్రవణ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రేణుకాఎల్లమ్మ జాతర

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ రేణుకాఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, ఎలాల జలపతిరెడ్డి, నల్ల రాజన్న పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్కం హన్మాంతు గౌడ్, గజ్జి గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షకులు బేడ బుడగ జంగాలు



వేదికపై సాంస్కృతిక సమరత ప్రతినిధులు

జగిత్యాలటౌన్: సంస్కృతి పరిరక్షణలో బేడ బుడగ జంగాలు ముందుంటారని సామాజిక సమరత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. బేడ బుడిగ జంగాల కాలనీలో సోమవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ బేడ బుడగ జంగాలు శివ భక్తులని, శివతత్వాన్ని, రామాయణ, బారత కథలను బుర్ర కథల రూపంలో గ్రామగ్రామాన ఇంటింటికి ప్రచారం చేయడంలో బేడ, బుడగ జంగాల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. బుడగ జంగాల్లోని పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ప్రలోభాలకు గురిచేస్తూ కొన్ని శక్తులు మత మార్పిడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వారవాసి మల్లవ్వ, తిరుమలయ్య, సమరత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్, భూమారెడ్డి, బొందుకూరి శ్రీనివాస్,సూర్యనారాయణ, పురుషోత్తం, శ్రీనివాస్, రాంరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే

కథలాపూర్: మండలంలోని దుంపేట, తాండ్ర్యాల, దూలూర్, గంభీర్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై సోమవారం సర్వే నిర్వహించారు. తొలిమెట్టులోని చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థులు ఏమి నేర్చుకున్నారో తెలుసుకునేందుకు వలంటీర్లు సర్వే చేపట్టారు. విద్యార్థులు చెప్పిన అంశాలను యాప్ లోనే ఎప్పటికప్పుడు నమోదు చేశారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సర్వేను మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థులు ఎంపిక

కథలాపూర్: ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమానికి కథలాపూర్ మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో లోకిని శ్రీనివాస్ సోమవారం తెలిపారు. గాజుల లిఖిత(జెడ్పీ హైస్కూల్ సిరికొండ), ఉత్కం హర్షిత్‌గౌడ్(జెడ్పీ హైస్కూల్ చింతకుంట), బోయిని శశాంక్(జెడ్పీ హైస్కూల్ చింతకుంట), ఉత్కం నవీత(జెడ్పీహైస్కూల్ చింతకుంట), వెలమల అనన్య(మాస్టో హైస్కూల్ కథలాపూర్) ఆన్‌లైన్‌లో విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి అవార్డులను ప్రకటించారని పేర్కొన్నారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ. 10 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలో వేయనున్నారు. ఈ నగదుతో గైడ్ టీచర్ మార్గదర్శకంలో విద్యార్థులు ఆవిష్కరణలు తయారు చేసి, జిల్లాస్థాయిలో నిర్వహించే సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శిస్తారని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

విద్యార్థినులకు బెడ్‌షీట్లు పంపిణీ

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం 307 మంది విద్యార్థినులకు ప్రత్యేకాధికారి రజిత దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినుల కోసం అన్ని వసతులు కల్పిస్తుందని శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్లాపూర్: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి ఎండీ.బాబా ఫరీద్ అందించిన పరీక్ష సామగ్రి ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, హెచ్‌ఎం చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఓ కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పంగ రాజయ్య ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి కారులో వెళ్తున్నాడు. అతివేగంగా వెళ్లి సయ్యద్ జాకీర్, సయ్యద్ సర్వర్, రోడ్డుపక్కన నిల్చున్న లెక్కల విజయను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. సయ్యద్ సర్వర్‌ను జగిత్యాల నుంచి కరీంనగర్ తరలించినట్లు గ్రామస్తుల ద్వారా తెల్సింది. ఎస్సై రవికిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని కారు నడిపిన రాజయ్యను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.